క్లుప్తంగా

ఆర్థికసాయం

కొడకండ్ల: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా పనిచేస్తూ అనారోగ్యానికి గురైన గోర్‌సింగ్‌కు టీఎస్ యూటీఎఫ్ కొడకండ్ల మండల శాఖ పక్షాన రూ.5వేల ఆర్థిక సహాయాన్ని అందజేశారు. మండల విద్యాశాఖ నోడల్ ఆఫీసర్ గ్రేస్‌కేజియారాణి, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ముషీర్‌ఖాన్, మండల అధ్యక్ష, కార్యదర్శులు వెంకటాద్రి, సోమయ్యలు పీడీని పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు.

ఎల్‌ఓసీ అందజేత

బచ్చన్నపేట: దబ్బగుంటపల్లికి చెందిన ముచ్చనపల్లి ఇజ్రాయిల్ కుమారుడు దేవదానం ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. కాగా, ఆయనకు మంజూరైన రూ. లక్ష ఎల్‌ఓసీని రైతుబంధు సమితి జిల్లా మాజీ కోఆర్డినేటర్ ఇర్రి రమణారెడ్డి గురువారం అందజేశారు. యూత్ అధ్యక్షుడు వడ్లెపల్లి ఉపేందర్‌రెడ్డి, మండల కోఆప్షన్ సభ్యులు మహమ్మద్ షబ్బీర్, నాయకులు పాల్గొన్నారు.

శబరిమలకు తరలిన అయ్యప్ప స్వాములు

కొడకండ్ల: మాల విరమణ కోసం అయ్యప్ప స్వాములు గురువారం శబరిమలకు తరలి వెళ్లారు. 41 రోజుల పాటు దీక్ష నిర్వహించిన స్వాములు మండలకేంద్రంలోని భక్తాంజనేయ స్వామి ఆలయంలో ఇరుముడులు కట్టుకొని మాల విరమణకు వెళ్లారు. కుటుంబసభ్యులు, బంధుమిత్రులు ఇరుముడుల పూజ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నివాళి

పాలకుర్తి: చెన్నూరు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పుస్కూరి వెంగళ్‌రావు ఇటీవల మృతి చెందాడు. కాగా గురువారం బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ గ్రామానికి చేరుకొని వెంగళ్‌రావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి బాధిత కుటుంబీకులను పరామర్శించారు. మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు జలగం కుమార్, ఈరవెన్ను గ్రామ అధ్యక్షుడు బిర్రు సోమేశ్వర్, మాజీ ఎంపీపీ కారుపోతుల శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఇద్దరికి జైలు



రఘునాథపల్లి: మండలంలోని మేకలగట్టుకు చెందిన నాటు సారా తయారుదారులు బానోత్ రేణుక, బానోత్ బద్రికి బైండోవర్ ఉల్లంఘనలో జైలు శిక్ష పడింది. మూడు నెలల క్రితం ఎక్సైజ్ అధికారులు ఇరువురు మహిళలను ఏడాదిపాటు నాటుసారా తయారు, విక్రయాలు చేపట్టొద్దని తహసీల్దార్ ముందు బైండోవర్ చేశారు. తిరిగి నాటుసారా తయారు చేస్తూ ఇరువురు మహిళలు ఎక్సైజ్ అధికారులకు పట్టుబడ్డారు. వారిపై కేసు నమోదు చేసి ఇరువురిని తిరిగి తహసీల్దార్ పురం యుగేందర్ ఎదుట బైండోవర్ చేశారు. గత బైండోవర్ ఉల్లంఘన మేరకు తహసీల్దార్ రూ.లక్ష జరిమానా.. కాక, ఏడాది జైలు శిక్ష విధించగా వారు జరిమానా చెల్లించక పోవడంతో ఇరువురిని జైలుకు తరలించినట్లు స్టేషన్‌ఘన్‌పూర్ ఎక్సైజ్ ఎస్‌హెచ్‌ఓ భాస్కర్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా ప్రొహిబిషన్ అధికారి కృష్ణప్రియ మాట్లాడుతూ జిల్లాలో నాటుసారా తయారు, అమ్మకాలను పూర్తిగా నిర్మూలించామని, ఎవరైనా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఎస్సై నరేష్, హెడ్ కానిస్టేబుల్ యాకుబ్ కానిస్టేబుళ్లు శ్రీనివాసరావు, సలీం, దస్తగిరి, ఉమారాణి పాల్గొన్నారు.

నేడు పాలకుర్తిలో సంక్రాంతి ముగ్గుల పోటీలు

పాలకుర్తి టౌన్: సంక్రాంతి పండుగ సందర్భంగా లయన్స్ క్లబ్ ఆఫ్(మహిళా)సేవా భారతి, అంతర్జాతీయ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో 12న ముగ్గుల పోటీలు నిర్వహిస్తున్నారు. ఈ పోటీల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే యశస్విని రెడ్డి, లయన్ కుందూరు వెంకట్ రెడ్డి, జిల్లా ఉప గవర్నర్‌లు హాజరవుతున్నారని నిర్వాహకులు తెలిపారు. మహిళామణులు, యువతులు ఎక్కువ సంఖ్యలో పాల్గొని పండుగ గొప్పతనం ప్రతిబింబించేలా అందమైన రంగవల్లులు వేయాలని అన్నారు. పోటీల్లో పాల్గొన్న వారికి బహుమతులు అందజేయడం జరుగుతుందని వారు తెలిపారు. పోటీలో పాల్గొనే వారు ఎవరి రంగులు వారే తీసుకు రావాలని తెలిపారు.

సంక్రాంతి సంబురాలకు తరలిన కాంగ్రెస్ శ్రేణులు

దేవరుప్పుల: పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరులో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి, ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆధ్వర్యంలో తలపెట్టిన సంక్రాంతి సంబరాలకు మండల నాయకులు గురువారం తరలివెళ్లారు. ఈ సందర్భంగా మండల పార్టీ అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించే దిశలో కాంగ్రెస్ పయనించే క్రమంలో సంక్రాంతి ఉత్సవాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. కాంగ్రెస్ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు నల్ల శ్రీరామ్.ఎస్టీ సెల్ మండల అధ్యక్షుడు భూక్య సజ్జన్ , సీనియర్ నాయకులు మానుపాటి మహేందర్, సోమ నరసయ్య, వెంకన్న ఉన్నారు.

జనగామ: న్యూ వాన్ కిడ్ ప్లేస్కూల్‌లో విద్యార్థులతో టీచర్లు



జనగామ: శ్రీ సరస్వతీ శిశుమందిర్‌లో ..



జనగామ రూరల్: వడ్లకొండలో..



జనగామ రూరల్: సెయింట్ మేరీస్ పాఠశాలలో భోగి మంటలు



ముందస్తు సంక్రాంతి సంబురాలు

జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో ముందస్తు సంక్రాంతి సంబురాలను గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ముగ్గులు, పతంగుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి పండుగ విశిష్టత, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా విద్యార్థులు ముగ్గులు వేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. ఆయా కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

–సాక్షి నెట్‌వర్క్



పాలకుర్తి: విస్నూరు పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



జనగామ రూరల్: శ్రీఅరబిందో హైస్కూల్‌లో..



తరిగొప్పుల: మరియపురం సెయింట్ ఆన్స్‌లో..



బచ్చన్నపేట: వాణి పాఠశాలలో..



చిల్పూరు: వెంకటేశ్వరపల్లి పాఠశాలలో..



జఫర్‌గఢ్: కూనూర్ ఉన్నత పాఠశాలలో ..



జఫర్‌గఢ్ గాలిపటాలు ఎగురవేస్తున్న విద్యార్థులు



జఫర్‌గఢ్: కూనూర్ ప్రాథమిక పాఠశాలలో..



నర్మెట: ముగ్గుల పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు



చిల్పూరు: హరిదాసు వేషధారణలో విద్యార్థి



కొడకండ్ల: ఎస్సీ కాలనీ పాఠశాలలో..

అథ్లెట్ చందుకు అభినందనలు

లింగాలఘణపురం: ఫిబ్రవరి 12 నుంచి 19 వరకు గుజరాత్‌లో జరిగే జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో పాల్గొనే నవాబుపేటకు చెందిన గోగికార్ చందును గురువారం జెడ్పీటీసీ గుడి వంశీధర్‌రెడ్డి శాలువా కప్పి అభినందించారు. అనంతరం రవాణా ఖర్చుల నిమిత్తం రూ.5వేల సాయం అందజేశారు. ఇటీవల జిల్లా కేంద్రంలోని మినీస్టేడియంలో జరిగిన 10వ నేషనల్ ఇంటర్ డిస్ట్రిక్ట్ జూనియర్ అథ్లెటిక్స్ మీట్ అండర్-16 గేమ్స్ షాట్‌పుట్‌లో చందు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు.

కిరాణం, పాన్‌షాపుల్లో పోలీసుల తనిఖీలు

జఫర్‌గఢ్: మండల కేంద్రంలోని కిరాణం, పాన్ షాపులు, కళాశాలల వద్ద ఉన్న పలు షాపుల్లో స్థానిక ఎస్సై మహేందర్ గురువారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మాదకద్రవ్యాలు, గంజాయి వంటి మత్తుపదార్థాలను నిరోధించేందుకు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మత్తుపదార్థాలకు అందరూ దూరంగా ఉండాలన్నారు. తనిఖీల్లో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరికి గాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్: పాలకుర్తి నుంచి ఘన్‌పూర్ వైపు వస్తున్న కారు అదుపుతప్పి రోడ్డుపై వెళ్తున్న వాహనదారులను ఢీకొట్టడంతో ఇద్దరికి గాయాలైన సంఘటన మండలంలోని ఇప్పగూడెంలో గురువారం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా భీమదేవరపల్లి మండలం పీచర గ్రామానికి చెందిన బత్తిని రాజు, చిల్పూరు మండలం ఫత్తేపూర్‌కు చెందిన గుగులోత్ వెంకన్న వేర్వేరుగా తమ పనుల నిమిత్తం ద్విచక్రవాహనాలపై పాలకుర్తి వైపు వెళ్తున్నారు. ఈ క్రమంలో పాలకుర్తి నుంచి ఘన్‌పూర్‌కు వస్తున్న కారు ఇప్పగూడెం వద్ద ఒక్కసారిగా అదుపుతప్పి ద్విచక్రవాహనాలను ఢీకొట్టింది. దాంతో ఒకరి కాళ్లకు, మరొకరి తలకు తీవ్ర గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు గాయపడ్డ వారిని చికిత్స నిమిత్తం 108 అంబులెన్స్‌లో హనుమకొండకు తరలించారు. కాగా ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు రాలేదని సీఐ సట్ల రాజు తెలిపారు.

డాక్టర్ నకారా కృషి చిరస్మరణీయం



పెన్షనర్లను సన్మానిస్తున్న రాజయ్య

స్టేషన్‌ఘన్‌పూర్: పెన్షన్ సాధన కోసం డాక్టర్ నకారా చేసిన కృషి చిరస్మరణీయమని స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు మేనేజర్ కృష్ణ, తెలంగాణ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రధాన కార్యదర్శి అంబటి రాజయ్య అన్నారు. ఘన్‌పూర్ డివిజన్ కేంద్రంలో పెన్షనర్ల సంఘం మండల అధ్యక్షుడు ఎండీ.దస్తగిరి ఆధ్వర్యంలో గురువారం పెన్షనర్ల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా హాజరైన వారు ముందుగా డాక్టర్ నకారా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పెన్షనర్లు ఐక్యంగా ఉండాలని, న్యాయమైన హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాలన్నారు. అనంతరం 12 మంది సీనియర్ పెన్షనర్లను సన్మానించారు. కార్యక్రమంలో పెన్షనర్లు, రిటైర్డ్ పర్సన్స్ ఎం.ఉపేందర్, కోతి భిక్షపతి, రావుల ఏడుకొండలు తదితరులు పాల్గొన్నారు.

జాతర చైర్మన్‌గా రాజ్‌కుమార్



చిల్పూరు: మండల కేంద్రంలోని చిల్పూరుగుట్ట(మబ్బుగుట్ట) సమ్మక్క–సారలమ్మ జాతర చైర్మన్‌గా మండల కేంద్రానికి చెందిన బొల్ల రాజ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గం ఇన్‌చార్జ్ సింగపురం ఇందిర ఆదేశాల మేరకు గురువారం గ్రామ ప్రజల సమక్షంలో రాజ్‌కుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతర నూతన కమిటీ ఎన్నిక అనంతరం కమిటీ సభ్యులతో కలిసి రాజ్‌కుమార్ మాట్లాడారు. రాజకీయాలకు అతీతంగా తనను జాతర కమిటీ చైర్మన్‌గా ఎన్నుకున్నందున అందరి సహకారంతో భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా సౌకర్యాలు కల్పిస్తానని అన్నారు. సర్పంచ్ రాజ్‌కుమార్, ఉప సర్పంచ్ మహేందర్ పాల్గొన్నారు.

విద్యార్థులు ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకోవాలి

బచ్చన్నపేట: ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాన్ని ఎంచుకొని చదువాలని ఎస్సై కంకల సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో హమారా విలేజ్ బృందం సభ్యులు పాఠశాల విద్యార్థులకు స్కూల్ బ్యాగులు, వాటర్ బాటిళ్లు, కంపాక్స్‌లను అందించారు. అనంతరం పాఠశాల హెచ్‌ఎం రఘువీర్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎస్సై మాట్లాడారు. పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు అదే పాఠశాల అభివృద్ధికి పాటు పడటం వారి అదృష్టమన్నారు. హమారా విలేజ్ పూర్వ విద్యార్థులు పాఠశాలలో రూ. 1.50 లక్షల విలువైన పనులు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ వడ్లెపల్లి మల్లారెడ్డి, హమారా విలేజ్ పూర్వ విద్యార్థులు కానుగంటి ఉదయ్, కొడూరి కార్తీక్, శ్రీనివాస్, వెంకటేష్,, ఎండీ.సద్దాం, చందు, పైస రాజశేఖర్, ప్రవీణ్, కిరణ్, ఎస్ఎంసీ చైర్మన్ నర్సింహులు, నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



బ్యాగులు అందజేస్తున్న ఎస్సై సతీష్

వివేకానందుని బోధనలు అనుసరణీయం

లింగాలఘణపురం: నేటి యువతకు వివేకానందుని బోధనలు ఎంతో అనుసరణీయమని పాఠశాల హెడ్మాస్టర్ మల్లికార్జున్ అన్నారు. ఈ నెల 12న వివేకానందుని జయంతి పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు పాటలు, ఉపన్యాసం, వ్యాసరచన, పద్య పోటీలు నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో పాఠశాల పూర్వ విద్యార్థుల ఐక్యవేదిక కన్వీనర్ మల్లేశం మాట్లాడుతూ స్ఫూర్తిదాయకమైన బోధనలతో స్వామి వివేకానందుడు యువజనుల్లో స్ఫూర్తిని నింపాడని అన్నారు. పోటీల్లో విజేతలు శివకుమార్, మానస, రిషిక, భవాని, చిత్ర, లోకేశ్, రష్మిత, కార్తీక్, మానస, అనూష, దుర్గాప్రసాద్, సాత్విక్, లోకేశ్, పావని, కార్తీక్, రష్మిత, బాలమణిలకు బహుమతి ప్రదానం చేశారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

3,462 దరఖాస్తుల 'ఆన్‌లైన్'

లింగాలఘణపురం: మండలంలోని 21 గ్రామ పంచాయతీల పరిధిలో వచ్చిన 13,462 అభయహస్తం దరఖాస్తులు గురువారంతో ఆన్‌లైన్ పూర్తి చేయడం జరిగిందని ఎంపీడీఓ సురేందర్ తెలిపారు. రేషన్ కార్డు లేదని దరఖాస్తులో నమోదు చేసిన వారి పేర్లు ఆయా కుటుంబాల యజమానుల రేషన్ కార్డుతో లింక్ అయ్యి ఉన్నాయని, పూర్తిగా రేషన్ కార్డులు లేని వారు సుమారుగా రెండు వేల వరకు ఉంటారని వీరి వివరాలు పంచాయతీ కార్యదర్శులకు ఇవ్వడం జరిగిందన్నారు. అసలే రేషన్ కార్డులేని వారి వివరాలను రేషన్ డీలర్ల వద్దకు వెళ్లి పూర్తి సమాచారం సేకరించి కార్డు లేదని ధ్రువీకరిస్తే ప్రభుత్వానికి నివేదిస్తామని చెప్పారు.

జాతర ప్రాంగణం పరిశీలన



జాతర ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న సీఐ

చిల్పూరు: వచ్చే నెలలో నిర్వహించే లింగంపల్లి సమ్మక్క–సారలమ్మ జాతర ప్రాంగణాన్ని జనగామ రూరల్ సీఐ ఎడవెల్లి శ్రీనివాస్‌రెడ్డి స్థానిక ఎస్సై వినయ్‌కుమార్‌తో కలిసి గురువారం పరిశీలించారు. అనంతరం ఆయన అమ్మవార్లకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ జాతరకు వచ్చే భక్తులకు ఇబ్బందులు లేకుండా అధికారులు, కమిటీ బాధ్యులు, గ్రామ పంచాయతీ, గ్రామస్తులు సౌకర్యాల కల్పనకు కృషి చేయాలని అన్నారు. సర్పంచ్ ఏదునూరి రవీందర్, ఉప సర్పంచ్ కంకటి రాజన్న, అపరాదపు రాజు, రావులపల్లి చంద్రమౌళి, కండ్లకోలు బాలరాజు, తుత్తరు రాజు, కంకటి నరేందర్, మాటూరి శ్రీనివాస్, కందుకూరి రాజుతోపాటు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శ పాఠశాలలో విద్యార్థుల స్వయంపాలన



స్వయంపాలనలో విద్యార్థులు

బచ్చన్నపేట: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులు స్వయంపాలనను ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ కర్ల కృష్ణవేణి తెలిపారు. గురువారం పాఠశాల ఆవరణలో ఆమె మాట్లాడుతూ విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి వారికి విద్యాబోధన చేశారని తెలిపారు. డీఈఓగా భరణి, డిప్యూటీ డీఈఓ దీక్షిత, ఎంఈఓ సౌమ్య, నోడల్ అధికారి రాఘవేంద్ర, హెచ్‌ఎం సమీరలు వ్యవహరించారని చెప్పారు. స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులకు జ్ఞాపికలను అందజేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ గొల్లపల్లి బాపురెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

రాములోరి అక్షింతలకు ప్రత్యేక పూజలు

చిల్పూరు: బుగులు వేంకటేశ్వరస్వామి ఆలయంలో గురువారం అయోధ్య నుంచి వచ్చిన రాములోరి అక్షింతలకు అర్చకులు రవీందర్‌శర్మ, రంగాచార్యులు, కృష్ణమాచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తుడు పన్నీరు అశోక్ అక్షింతల కలశంతో శోభాయాత్ర నిర్వహించారు.

పెంబర్తిలో..

జనగామ రూరల్: అయోధ్య రాముని అక్షింతలను గురువారం ట్రస్ట్ జిల్లా సహాయ సంయోజక్ దొందుల శేఖర్ ఆధ్వర్యంలో పెంబర్తిలో ఇంటింటా పంపిణీ చేశారు. ఈ నెల 15 వరకు ఇంటింటికి చేరేలా కమిటీ కృషి చేస్తుందని తెలిపారు.

వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రఘునాథపల్లి: ఖిలాషాపూర్‌కు చెందిన నక్క సురేష్ రచించిన జ్ఞాన పుష్పం పుస్తకావిష్కరణ ఆహ్వాన వాల్‌పోస్టర్లను స్థానిక బస్టాండ్ వద్ద సర్పంచ్ ముప్పిడి శ్రీధర్‌గౌడ్ గురువారం గ్రామ పెద్దలతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ రేపు జిల్లా కేంద్రంలోని కామాక్షిఫంక్షన్ హాల్‌లో జరిగే జ్ఞాన పుస్తకావిష్కరణ సభ కార్యక్రమానికి ప్రజా సంఘాల నాయకులు, కుల సంఘాల నాయకులు, ఉద్యోగులు హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

నేడు వేలం

పాలకుర్తి: బమ్మెర పరిధిలోని ఆలేటి ఎల్లవ్వ జాతరకు సంబంధించి 12(శుక్రవారం)న ఉదయం 11 గంటలకు వేలం వేయనున్నట్లు సర్పంచ్ నాగభూషణం తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ జాతరలో కొబ్బరి కాయలు, పూజ సామగ్రి, లడ్డు, పులి హోర, ప్రసాద విక్రయం, దుకాణాల ఏర్పాటు, పార్కింగ్, దర్శనం టికెట్లకు వేలం నిర్వహించనున్నట్లు సర్పంచ్ తెలిపారు.

'దుగ్యాల' సేవలు మరువలేనివి

పాలకుర్తి: మాజీ ఎమ్మెల్యే దుగ్యాల శ్రీనివాసరావు ప్రజలకు అందించిన సేవలు మరువలేనివని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ అన్నారు. గురువారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శ్రీనివాసరావు 3వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

రెండు తలల గొర్రె పిల్ల జననం



పాలకుర్తి: మండలంలోని భీక్యానాయక్ పెద్దతండా పంచాయతీ పరిధి కన్యాతండాలో గుగులోత్ సాంక్రుకు చెందిన గొర్రెకు గురువారం రెండు తలల గొర్రె పిల్ల జన్మించింది. రెండు తలలు, నాలుగు కళ్లతో వింత ఆకారంలో ఉండటంతో గ్రామస్తులు వచ్చి చూసి వెళ్తున్నారు.

ప్రమాదకరంగా లోలెవల్ కల్వర్టు

చిల్పూరు: చిల్పూరుగుట్ట నుంచి మండల కేంద్రానికి వెళ్లే రోడ్డులో బర్రెంకల చెరువు మత్తడి వద్ద లోలెవల్ కల్వర్టు కుంగి ప్రమాదకరంగా మారింది. ప్రతి నిత్యం మండల కేంద్రానికి వివిధ పనుల నిమిత్తం ప్రజలు వాహనాల్లో వస్తుంటారు. ఇటీవల కల్వర్టు మధ్యలో పెద్ద గుంత ఏర్పడగా సర్పంచ్ రాజ్‌కుమార్ ప్రత్యామ్నాయంగా మట్టి పోయించారు. బుధవారం రాత్రి మళ్లీ పెద్ద గుంత ఏర్పడింది. వచ్చే నెలలో జాతర ఉన్నందున బ్రిడ్జి నిర్మించాలని వాహన చోదకులు కోరుతున్నారు.

అధ్వానంగా రిజిస్ట్రేషన్ ఆఫీస్ దారి

జనగామ రూరల్: పట్టణంలోని 6వ వార్డు పరిధిలోని రిజిస్ట్రేషన్ కార్యాలయానికి, సబ్‌జైల్‌కు వెళ్లే దారి గుంతల మయమై అధ్వానంగా మారింది. నిత్యం వందల సంఖ్యలో రిజిస్ట్రేషన్ కార్యాలయానికి ప్రజలు వస్తుంటారు. వాహనాల రద్దీతో గుంతలు ఎక్కువై ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. మున్సిపల్ అధికారులు తక్షణం స్పందించి రోడ్డును బాగు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఎదుగుదల

లింగాలఘణపురం: పౌష్టికాహారంతోనే పిల్లల్లో ఎదుగుదల ఉంటుందని, దాని ప్రాముఖ్యతను తెలుసుకొని అందించాలని నోడల్ ఆఫీసర్ విష్ణుమూర్తి కోరారు. గురువారం కిష్టగూడెం ప్రాథమిక పాఠశాలలో పౌష్టికాహారంపై నూతనంగా ప్రదర్శన ఇచ్చారు. ఈ సందర్భంగా పౌష్టిక ఆహారాన్ని తయారు చేసి తీసుకొచ్చి వాటి ప్రాముఖ్యతను ఉపాధ్యాయురాలు అరుణోదయ వివరించారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ మాధవి, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



పౌష్టిక ఆహారంపై ప్రదర్శన ఇస్తున్న ఉపాధ్యాయులు

బాధిత కుటుంబానికి పరామర్శ



షాబుద్దీన్ (ఫైల్)

బచ్చన్నపేట: పోచన్నపేటలో బీఆర్ఎస్ నాయకుడు షాబుద్దీన్ (70) గురువారం గుండె పోటుతో మృతి చెందాడు. కాగా పలువురు నాయకులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. సర్పంచ్ గట్టు మంజులమల్లేశం, ఎంపీటీసీ మామిడి అరుణ ఐలయ్య, నాయకులు ఇర్రి రమణారెడ్డి, గూడ సిద్దారెడ్డి, కంసాని మహేందర్, ఫిరోజ్, బాలచందర్, సోమిరెడ్డి ఉన్నారు.

చర్య తీసుకోవాలి

జఫర్‌గఢ్: ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని ఆక్రమించిన వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకోవాలని సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి జువారి రమేష్, సీపీఎం మండల నాయకుడు కాట సుధాకర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వివిధ పార్టీలు, యూత్ అసోసియేషన్ సభ్యులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆర్టీసీ అధికారులు జఫర్‌గఢ్‌లో ఆక్రమణకు గురైన బస్టాండ్ స్థలాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జఫర్‌గఢ్‌లో ఉన్న ఆర్టీసీ బస్టాండ్ స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించారన్నారు. ఆక్రమణకు పాల్పడిన వ్యక్తులపై వెంటనే కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే తక్షణమే స్థలంలో బస్టాండ్‌ను నిర్మించాలని వారు కోరారు. ఎంపీటీసీలు జ్యోతి రజిత యాకయ్య, ఇల్లందుల స్రవంతి మొగిళి, సీపీఎం జిల్లా నాయకులు రాపర్తి సోమయ్య, యూత్ అధ్యక్షులు చవనబోయిన అరుణ్, వార్డు సభ్యులు కుక్కల ఎల్లయ్య, అయేషాబేగం, నంచర్ల కోటి, ఆర్టీసీ అధికారి రఘువీర్, వీవీఓ పి నాగేశ్వర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.



బస్టాండ్ స్థలాన్ని పరిశీలిస్తున్న నాయకులు, అధికారులు